# కొరింథీయులకు
# వ్రాసిన రెండవ పత్రిక

1 దేవుని చిత్తాన్ని బట్టి క్రీస్తు యేసు అపొస్తలుడైన పౌలు, మన
సోదరుడు తిమోతి,
కొరింథీలోని దేవుని సంఘానికి, అకాయ ప్రాంతమంతటిలోని
దేవుని పరిశుద్ధులందరికి కలిపి వ్రాయునది:
2 మన తండ్రియైన దేవుని నుండి, ప్రభువైన యేసు క్రీస్తు నుండి
మీకు కృపా సమాధానం కలుగును గాక.

## అన్ని విధాలా ఆదరణనిచ్చే దేవునికి స్తోత్రాలు

3 మన యేసు క్రీస్తు ప్రభువుకు తండ్రియైన దేవునికి కృతజ్ఞతలు
చెల్లిందాము. మన తండ్రి కనికరం గలవాడు. సమస్త అన్ని విధాలా
ఆదరణనిచ్చే దేవుడు.
4 దేవుడు మనల్ని ఏ ఆదరణతో ఆదరిస్తున్నారో, అదే ఆదరణతో
అలాంటి కష్టాల్లో ఉన్నవారిని ఆదరించగలిగేలా ఆయన మమ్మల్ని
ఆదరిస్తున్నారు.
5 క్రీస్తు శ్రమలలో మనం ఎంత ఎక్కువ భాగం పంచుకున్నామో క్రీస్తు
ఆదరణ కూడా అంతే ఎక్కువగా మనకు కలుగుతుంది.
6 మేము శ్రమపడడం మీకు ఆదరణ కోసం రక్షణ కోసమే. ఆదరణ
లభిస్తే అది మీ కొరకే కాబట్టి మేము పడిన కష్టాలను మీరు కూడా
ఓపికతో భరించడానికి శక్తి లభిస్తుంది.
7 మీరు మా కష్టాల్లో పాలివారైనట్లే ఆదరణలో కూడా
పాలుపంచుకుంటారని మాకు తెలుసు. కాబట్టి మీలో మా నిరీక్షణ
స్థిరంగా ఉంది.

8 సహోదరి సహోదరులారా, ఆసియా ప్రాంతంలో మాకు ఎదురైన
కష్టాల గురించి మీకు చెప్పకుండా ఉండాలని అనుకోవడం లేదు.
మేము మా శక్తికి మించిన కష్టాలను అనుభవించాము. కాబట్టి మేము
జీవితంపై ఆశ వదులుకున్నాము.
9 మాకు మరణశిక్ష విధించబడినట్లుగా భావించించాము. మేము
మాపై ఆధారపడక, మృతులను కూడ పునరుత్థానులుగా చేసిన
దేవునిపై ఆధారపడడానికే అలా జరిగింది.
10 మరణకరమైన భయంకర ప్రమాదాల నుండి ఆయన మమ్మల్ని
కాపాడారు. ఇకముందు కూడా కాపాడతారు. ఇకముందు కూడ
కాపాడతాడు. ఆయన తిరిగి మమ్మల్ని కాపాడతారని ఆయనలో
నిరీక్షణ కలిగి ఉన్నాము.
11 మీ ప్రార్థనల ద్వారా మాకు సహాయం చేస్తున్నారు, కాబట్టి
వాటిలో అనేక ప్రార్థనలకు జవాబుగా దేవుడు మామీద దయ
చూపినందుకు మా పక్షంగా అనేకులు కృతజ్ఞతలు చెల్లిస్తున్నారు.

## పౌలు ప్రణాళికలో మార్పు

12 ఇప్పుడు ఇది మాకు గర్వకారణం: ముఖ్యంగా మీతో మాకు
గల సంబంధం విషయంలో నిజాయితీతో, దేవుడు ఇచ్చే పవిత్రతతో
మేము నడచుకున్నాము. లోకజ్ఞానంపై ఆధారపడక దేవుని కృపపై
ఆధారపడి నడుచుకున్నామని మా మనస్సాక్షి సాక్ష్యమిస్తుంది.
13 ఎందుకంటే, మీరు చదివి, అర్థం చేసుకోగలిగిన సంగతులను
మాత్రమే మీకు వ్రాస్తున్నానని నేను అనుకుంటున్నాను.
14 ఇప్పుడు మీరు కొంతవరకు మాత్రమే అర్థం చేసుకోగల
విషయాన్ని, రాబోవు కాలంలో సంపూర్ణంగా గ్రహిస్తారని నేను
నిరీక్షిస్తున్నాను. అప్పుడు యేసు ప్రభువు దినాన మమ్మల్ని చూసి
మీరు ఎంతగా గర్విస్తారో, మిమ్మల్ని చూసి మేము కూడా అలాగే
గర్విస్తాము.

15 దీన్ని గురించి నాకు చాలా నమ్మకం ఉన్నందువల్ల, మీకు రెట్టింపు
ఆనందం కలిగేలా నేను మొదట మిమ్మల్ని చూడడానికి రావాలని
అనుకున్నాను.
16 నేను మాసిదోనియాకు వెళ్లేటప్పుడు, అక్కడ నుండి తిరిగి
వచ్చేటప్పుడు మీ దగ్గరకు రావాలని, మీరు నన్ను యూదయకు
పంపాలని అనుకున్నాను.
17 నేను ఇలా ఆలోచించి అస్థిరంగా నడుచుకున్నానా? నేను
స్వార్థంగా ఆలోచిస్తున్నానా? ఔను ఔనని చెప్తూ కాదు కాదని
చెప్తున్నానా?
18 అయితే దేవుడు నమ్మదగినవాడు కాబట్టి, మా వర్తమానం
"అవునని" చెప్పి "కాదు" అనేలా ఉండదు.
19 ఎందుకంటే సీల* ద్వారా, తిమోతి ద్వారా, నా ద్వారా మీకు
బోధించబడిన దేవుని కుమారుడైన యేసు క్రీస్తు అవునని చెప్పి,
కాదనేవాడు కాడు.
20 ఎందుకంటే, దేవుని వాగ్దానాలన్ని క్రీస్తులో "అవును" అన్నట్లుగా
ఉన్నాయి. అందుకే, దేవునికి మహిమ కలుగడానికి యేసు క్రీస్తు
ద్వారా మనం "ఆమేన్" అని అంటున్నాము.
21 మీతో కూడా క్రీస్తులో నిలిచి ఉండేలా, మమ్మల్ని స్థిరపరచి
అభిషేకించినవాడు దేవుడే.
22 ఆయనే తన ముద్రను మనపై వేసి మనల్ని తన వారిగా
ప్రకటించారు. ఆయన మనకిచ్చిన వాటిని ధృవపరచడానికి మన
హృదయాల్లో పవిత్రాత్మను అనుగ్రహించారు.
23 నా ప్రాణం తోడు దేవుడే దీనికి సాక్షిగా పెట్టుకున్నాను; మిమ్మల్ని
బాధపెట్టడం ఇష్టం లేనందువల్ల నేను తిరిగి కొరింథీకి రాలేదు.
24 అందుకే మీరు విశ్వాసం వల్ల దృఢంగా నిలిచి ఉన్నారు. కాబట్టి
మీ విశ్వాస విషయమై మేము ఆజ్ఞాపించడంలేదు. పైగా మేము మీ
సంతోషం కోసం మీ తోటిపనివారిగా పనిచేస్తున్నాము.

---

* **1:19** గ్రీకులో సిల్వాను సీల యొక్క మరో రూపం

# 2

1 కాబట్టి నేను దుఃఖం కలిగించేలా మీ దగ్గరకు తిరిగి రాకూడదని
నేను నిర్ణయించుకున్నాను.
2 ఎందుకంటే, నేను మీకు దుఃఖం కలిగిస్తే, నేను దుఃఖంలో
విడిచిపెట్టిన వారు తప్ప మరి ఎవరు నన్ను సంతోషపెట్టగలరు?
3 కాబట్టి, నేను అక్కడికి వచ్చినపుడు నన్ను సంతోషపెట్టాల్సిన
వ్యక్తులే నన్ను దుఃఖపెట్టకూడదని నేను మీకు వ్రాశాను. నా ఆనందమే
మీ అందరి ఆనందమని నాకు గట్టి నమ్మకము.
4 ఎంతో దుఃఖ హృదయంతో, కన్నీటితో మీకు వ్రాశాను. నేను
వ్రాసింది మిమ్మల్ని బాధపెట్టడానికి కాదు కాని, నేను మిమ్మల్ని ఎంతగా
ప్రేమిస్తున్నానో, మీరు గుర్తించడానికి మాత్రమే.

### దోషికి క్షమాపణ

5 ఎవరైనా దుఃఖం కలిగిస్తే, నాకు మాత్రమే గాక మీకందరికిని
దుఃఖం కలిగించినట్లే. ఇంతకంటే కఠినంగా మాట్లాడటం నాకు ఇష్టం
లేదు.
6 అలాంటి వానికి మీలో ఎక్కువ మంది ద్వారా విధించబడిన శిక్షే
చాలు.
7 కాబట్టి మీరిక అతన్ని శిక్షించకుండా క్షమించి, ఓదార్చడం
మంచిది, లేకపోతే అతడు అధిక దుఃఖంలో మునిగిపోతాడేమో.
8 అందుకే, మీరు అతని పట్ల మీ ప్రేమను మళ్ళీ రూఢిపరచుమని
మిమ్మల్ని వేడుకుంటున్నాను.
9 మిమ్మల్ని పరీక్షించి, అన్ని విషయాల్లో మీరు విధేయత
చూపుతారో లేదో తెలుసుకోవడానికి నేను అలా వ్రాశాను.
10 మీరు క్షమించేవారిని నేను క్షమిస్తాను. నేను ఏ దోషమైన క్షమిస్తే,
మీ కోసమే క్రీస్తును బట్టి క్షమిస్తాను.
11 సాతాను మనపై ఆధిక్యాన్ని పొందకుండా అలా చేశాను,
సాతాను తంత్రాలు మనకు తెలియనివి కావు.

### క్రొత్త నిబంధన పరిచారకులు

12 క్రీస్తు సువార్తను బోధించడానికి నేను త్రోయకు చేరినప్పుడు
ప్రభువు నా పని కోసం అప్పటికే అక్కడ మార్గం సిద్ధపరచి ఉంచారని
తెలుసుకున్నాను.
13 కాని నా సోదరుడు తీతును అక్కడ నాకు కనిపించకపోవడంతో
నా మనస్సుకు నెమ్మది లేదు. కాబట్టి అక్కడి ప్రజలకు వీడ్కోలు చెప్పి
మాసిదోనియా ప్రాంతానికి వెళ్లాను.
14 కాబట్టి ఆయన మా ద్వారా ప్రతి స్థలంలో క్రీస్తును గురించిన
జ్ఞానపు సువాసన వ్యాపింపచేస్తూ, ఆయనలో మమ్మల్ని ఎల్లప్పుడు
విజయోత్సాహంతో ముందుకు నడిపిస్తున్న దేవునికి కృతజ్ఞతలు.
15 ఎందుకంటే, రక్షించబడుతున్నవారి మధ్య, నశించేవారి మధ్య
మేము దేవునికి ఇష్టమైన క్రీస్తు పరిమళంగా ఉన్నాము.
16 ఒకరికి మరణం తెచ్చే వాసనగా, మరొకరికి జీవం తెచ్చే వాసనగా
ఉన్నాము. కాబట్టి, అలాంటి కార్యానికి యోగ్యులు ఎవరు?
17 మేము దేవుని వాక్యాన్ని స్వలాభం కోసం అమ్మేవారం కాదు,
మేము దేవుని వాక్యాన్ని నిజాయితీగా క్రీస్తు అధికారంతో ఆయన
ఎదుట బోధిస్తున్నాము. దేవుడు మమ్మల్ని చూస్తున్నారని మాకు
తెలుసు.

# 3

1 మమ్మల్ని మేమే మరల మెచ్చుకోవడం ప్రారంభించామా? లేదా
ఇతరుల్లా మీకు గాని మీ దగ్గరి నుండి గాని మాకు సిఫారసు పత్రికలు
అవసరమా?
2 మా హృదయాల మీద వ్రాయబడి, మనుష్యులందరు
తెలుసుకుని చదవాల్సిన మా పత్రిక మీరే.
3 రాతి పలక మీద గాని సిరాతో గాని వ్రాయక మానవ హృదయాలు
అనే పలకల మీద జీవంగల దేవుని ఆత్మ ద్వారా వ్రాయబడిన
క్రీస్తు పత్రిక మీరేనని, మా పరిచర్య ఫలితం మీరేనని మీరు
తెలియపరుస్తున్నారు.
4 ఇలాంటి నమ్మకం క్రీస్తు ద్వారా దేవునిపై మాకుంది.

5 మేము ఈ పనిని సాధించగలమని చెప్పుకోడానికి మేము
సమర్థులమని కాదు, మాలో ఉన్న సామర్థ్యం దేవుని నుండి వచ్చింది.
6 వ్రాతపూర్వకమైన నియమాలను కాక, ఆత్మతో కూడిన క్రొత్త
నిబంధనను సేవించగల సామర్థ్యాన్ని ఆయనే మాకు ఇచ్చారు.
అక్షరం చంపుతుంది కాని ఆత్మ జీవం ఇస్తాడు.

## క్రొత్త నిబంధన యొక్క గొప్ప మహిమ

7 మరణాన్ని తెచ్చే పరిచర్య రాళ్లమీద అక్షరాలలో చెక్కబడినా,
అది మహిమతో వచ్చింది. మోషే ముఖంపై ప్రకాశించిన మహిమ
శాశ్వతమైనది కాకపోయినా ఇశ్రాయేలీయులు దాన్ని నేరుగా
చూడలేకపోయారు.
8 అయితే ఆత్మ సంబంధమైన పరిచర్య మరి ఎంత మహిమకరంగా
ఉంటుంది?
9 శిక్షను తెచ్చే పరిచర్య మహిమ కలిగి ఉంటే, నీతిమంతులుగా
చేసే పరిచర్య ఇంకా ఎంత అధిక మహిమ కలిగి ఉంటుందో!
10 అందుకే, ఇప్పటి అత్యున్నతమైన మహిమతో పోల్చినప్పుడు
ఇప్పటివరకు మహిమకరంగా ఉన్నవేవి మహిమగా ఉండవు.
11 ఎందుకంటే, గతించిపోయే దానిలోనే మహిమ ఉంటే,
ఎల్లప్పుడు నిలిచి ఉండే దానిలో ఇంకెంత మహిమ ఉంటుందో
కదా!
12 కాబట్టి, మాకు ఇలాంటి నిరీక్షణ ఉంది, అందుకే మేము ఇంత
ధైర్యంతో ఉన్నాము.
13 మేము మోషేలాంటి వారం కాదు, తరిగిపోతున్న దాని అంతాన్ని
ఇశ్రాయేలు ప్రజలు చూడకుండ మోషే తన ముఖం మీద ముసుగు
వేసుకున్నాడు.
14 నిజానికి వారి మనస్సులు మొద్దుబారాయి, పాత నిబంధన
చదువుతున్నపుడు ఈనాటికీ వారి మనస్సులకు ఆ ముసుగు అలాగే
ఉంది. అది తీసివేయబడలేదు ఎందుకంటే కేవలం క్రీస్తులో మాత్రమే
అది తీసివేయబడుతుంది.

15 నేటికీ వారు మోషే ధర్మశాస్త్రాన్ని చదివేటప్పుడు, వారి
హృదయాల మీద ముసుగు ఉంది.
16 కాని ఎవరైనా ప్రభువు వైపుకు తిరిగితే ఆ ముసుగు
తీసివేయబడుతుంది.
17 ఇప్పుడు ప్రభువే ఆత్మ. ప్రభువు ఆత్మ ఎక్కడ ఉన్నాడో అక్కడ
స్వాతంత్ర్యం ఉంటుంది.
18 కాబట్టి ముసుగు తొలగిన ముఖాలతో ఆత్మయైన ప్రభువు నుండి
వచ్చే ఆయన మహిమను ప్రతిబింబిస్తూ, అంతకంతకు అధికమయ్యే
ఆయన మహిమ రూపంలోనికి మనమందరం మార్చబడుతున్నాము.

# 4

## ప్రస్తుత బలహీనత, పునరుత్థాన జీవితం

1 దేవుని కనికరాన్ని బట్టి ఈ పరిచర్యను మేము కలిగి ఉన్నాము,
కాబట్టి మేము ధైర్యాన్ని కోల్పోము.
2 అయితే సిగ్గుపడాల్సిన రహస్యమైన పనులను విడిచిపెట్టాం;
మోసాన్ని చేయడం లేదు, దేవుని వాక్యాన్ని వంకరగా బోధించకుండా
సత్యాన్ని స్పష్టంగా ప్రకటించడం ద్వారా దేవుని దృష్టిలో ప్రతివాని
మనస్సాక్షికి మమ్మల్ని మేము అప్పగించుకుంటున్నాము.
3 ఒకవేళ మేము బోధించే సువార్త ఎవరికైనా మరుగు చేయబడి
ఉంటే అది నశించేవారికి మాత్రమే.
4 దేవుని స్వరూపియైన క్రీస్తు మహిమను తెలియజేసే సువార్త
వెలుగును వారు చూడకుండ ఈ యుగసంబంధమైన దేవత
అవిశ్వాసులైనవారి మనస్సుకు గ్రుడ్డితనం కలుగజేసింది.
5 ఎందుకంటే మా గురించి మేము ప్రకటించడం లేదు కాని
యేసు క్రీస్తు ప్రభువని, యేసు కోసం మేము మీ సేవకులమని
ప్రకటిస్తున్నాము.

6 “చీకటి నుండి వెలుగు ప్రకాశించును గాక”* అని పలికిన
ఆ దేవుడే క్రీస్తు ముఖంపై ప్రకాశించే దైవ మహిమను, జ్ఞానమనే
వెలుగును మాకు ఇవ్వడానికి మా హృదయాల్లో తన వెలుగును
ప్రకాశింపజేశారు.

7 అయితే ఈ అత్యధిక శక్తి అంతా దేవునిదే గాని మాది కాదు అని
చూపించడానికి, మేము మట్టి పాత్రల్లో ఈ సంపదను కలిగి ఉన్నాము.
8 మేము అన్ని వైపుల నుండి తీవ్రమైన శ్రమలకు గురయ్యాం కాని
నలిగిపోలేదు; ఆందోళన కలిగినా నిరాశ చెందలేదు;
9 హింసించబడినా విడిచిపెట్టబడలేదు; పడత్రోయబడినా
నాశనమవ్వలేదు.
10 మా శరీరంలో యేసు జీవం ప్రత్యక్షపరచబడాలని ఆయన
మరణాన్ని మా శరీరంలో ఎప్పుడు మోస్తునే ఉన్నాము.
11 మా క్షయమైన శరీరంలో యేసు జీవం ప్రత్యక్షపరచబడాలని
సజీవులమైన మేము ఎల్లప్పుడు యేసు కొరకై మరణానికి
అప్పగించబడుతున్నాము.
12 కాబట్టి మాలో మరణం పని చేస్తుంది, కాని మీలో జీవం పని
చేస్తుంది.

13 “నేను విశ్వసించాను కాబట్టి మాట్లాడాను”† అని వ్రాయబడి
ఉంది. అదే విశ్వాసపు ఆత్మ మాలో కూడా ఉంది, కాబట్టి మేము
కూడా విశ్వసిస్తున్నాం కాబట్టి మాట్లాడుతున్నాము.
14 ఎందుకంటే, ప్రభువైన యేసును మృతులలో నుండి లేపిన
దేవుడు, యేసుతో పాటు మమ్మల్ని కూడా లేవనెత్తి మీతో పాటు తన
ఎదుట నిలబెడతారని మాకు తెలుసు.
15 ఇదంతా మీ మేలు కోసమే, అప్పుడు దేవుని కృప అధికంగా
వ్యాపించి ప్రజలు అధిక సంఖ్యలో దేవుని మహిమకు విస్తారంగా
కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తారు.

* **4:6** ఆది 1:3 † **4:13** కీర్తన 116:10

16 కాబట్టి మేము ఎప్పుడు ధైర్యాన్ని కోల్పోము. మేము బాహ్యంగా
క్షీణిస్తున్నా, అంతరంగంలో దినదినం నూతనపరచబడుతున్నాము.
17 మేము అనుభవిస్తున్న ఈ క్షణికమైన తేలికైన కష్టాలు వాటికన్నా
ఎంతో అధికమైన నిత్య మహిమను సంపాదిస్తున్నాయి.
18 కాబట్టి కనిపించే వాటిపై కాక కనిపించని వాటిపై మా దృష్టిని
నిలిపాము. ఎందుకంటే కనిపించేవి తాత్కాలికమైనవి, కనిపించనివి
శాశ్వతమైనవి.

# 5

## నూతన శరీరం కోసం వేచివుండటం

1 మనం నివసిస్తున్న భూసంబంధమైన గుడారం నాశనమైనా,
మానవ నిర్మితం కాని దేవుడు కట్టిన ఒక శాశ్వతమైన గృహం
పరలోకంలో ఉందని మనకు తెలుసు.
2 ఈలోగా పరలోకం నుండి వచ్చే మన నివాసాన్ని ధరించుకోవాలని
ఆశపడుతూ మనం మూలుగుతున్నాము.
3 ఎందుకంటే దాన్ని ధరించుకుంటే మనం దిగంబరులుగా
కనబడము.
4 ఈ గుడారంలో ఉన్నంతసేపు మనం భారం మోస్తూ మూల్గుతూ
ఉన్నాం, ఎందుకంటే, మనం దిగంబరులుగా ఉండాలని కోరుకోం కాని
చనిపోయేది జీవం చేత మ్రింగివేయబడేలా, మన పరలోక నివాసాన్ని
ధరించుకోవాలని కోరుతున్నాము.
5 దీని కోసం మనల్ని సిద్ధపరచింది దేవుడే; ఆయనే రాబోయే దానికి
హామీగా తన ఆత్మను మనకు ఇచ్చారు.
6 కాబట్టి మనం ఎల్లప్పుడు ఆత్మవిశ్వాసంతో ఉన్నాం, ఈ దేహంలో
నివసించేంత కాలం ప్రభువుకు దూరంగా ఉన్నామని మనకు తెలుసు.
7 మనం కంటికి కనిపించే దాన్ని కాక, విశ్వాసం వల్ల జీవిస్తున్నాము.
8 కాబట్టి నేను చెప్పేది ఏంటంటే, మనం సంపూర్ణ నమ్మకం కలిగి
ఈ శరీరాన్ని విడిచిపెట్టి ప్రభువు దగ్గర నివసించాలని ఎంతగానో
ఇష్టపడుతున్నాము.

9 కాబట్టి మనం ఈ శరీరంలో ఉన్నా లేదా దానికి దూరంగా ఉన్నా
ఆయనను సంతోషపెట్టడమే లక్ష్యంగా ఉందాము.
10 ఎందుకంటే, మనలో ప్రతి ఒక్కరు తాము శరీరంలో ఉండగా
చేసిన వాటికి, అవి మంచివైనా చెడ్డవైనా, తగిన ప్రతిఫలాన్ని
పొందడానికి మనమందరం క్రీస్తు న్యాయసింహాసనం ఎదుట
ఖచ్చితంగా కనబడాలి.

## సమాధానపరిచే పరిచర్య

11 అయితే, ప్రభువుకు భయపడడం అంటే ఏమిటో మాకు తెలుసు
కాబట్టి ఇతరులకు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్నాము. మేమేంటో
దేవునికి స్పష్టంగా తెలుసు, మీ మనస్సాక్షికి కూడ స్పష్టంగా తెలుసని
నేను నమ్ముతున్నాను.
12 మరల మీ ముందు మమ్మల్ని మేము పొగడుకోవాలని
ప్రయత్నించడం లేదు కాని, హృదయంలో ఉన్నదానిని బట్టి కాక,
కనిపించే దానిని బట్టి గర్వించే వారికి మీరు జవాబు చెప్పగలిగేలా
మమ్మల్ని బట్టి మీరు గర్వించడానికి ఒక కారణాన్ని ఇస్తున్నాము.
13 కొందరు చెప్పినట్లు, మేము పిచ్చివారమైతే అది దేవుని కోసం
మాత్రమే; మేము వివేకవంతులమైనా అది మీ కోసమే.
14 క్రీస్తు ప్రేమ మమ్మల్ని బలవంతం చేస్తుంది, ఎందుకంటే అందరి
కోసం ఒక్కడే మరణించాడు కాబట్టి అందరు మరణించినట్టే అని
మనం ఒప్పించబడ్డాము.
15 ఆయన అందరి కోసం చనిపోయారు, కాబట్టి జీవిస్తున్నవారు
ఇకపై తమ కోసం కాక, వారి కోసం మరణించి తిరిగి లేచిన ఆయన
కొరకే జీవించాలి.
16 అందువల్ల, మేము ఇప్పటినుండి లోక దృష్టితో ఎవరిని
లక్ష్యపెట్టము. ఒకప్పుడు మేము క్రీస్తును ఇలాగే లక్ష్యపెట్టినా, ఇక
మేము అలా చేయము.
17 కాబట్టి ఎవరైనా క్రీస్తులో ఉంటే, వారు నూతన సృష్టి; పాతవి
గతించాయి, క్రొత్తవి మొదలయ్యాయి!

18 ఇదంతా దేవుని వల్లనే జరిగింది, ఆయన క్రీస్తు ద్వారా మనల్ని
తనతో సమాధానపరచుకుని ఆ సమాధానపరిచే పరిచర్యను మాకు
అప్పగించారు.
19 ఆ పరిచర్య ఏంటంటే: దేవుడు ప్రజల పాపాలను వారి మీద
మోపకుండా క్రీస్తు ద్వారా లోకాన్ని తనతో సమాధానపరచుకున్నారు.
ఆ సమాధాన సందేశాన్ని బోధించే పని మాకు అప్పగించారు.
20 అందువల్ల మేము దేవుడు మా ద్వారా వేడుకోడానికి
ఏర్పరచబడిన క్రీస్తు రాయబారులము. దేవునితో సమాధానపడమని
క్రీస్తు పక్షంగా మిమ్మల్ని బ్రతిమాలుతున్నాము.
21 మనం ఆయనలో దేవుని నీతి అయ్యేలా, పాపమెరుగని
ఆయనను మన కోసం పాపంగా* చేశారు.

# 6

1 దేవుని తోటిపనివారిగా మేము, మీరు పొందిన దేవుని కృపను
వ్యర్థం చేసుకోవద్దని మిమ్మల్ని వేడుకుంటున్నాము.
2 అయితే,
“నా అనుకూల సమయంలో నీ మొర ఆలకించాను,
రక్షణ దినాన నేను నీకు సహాయం చేశాను”*
అని ఆయన చెప్తున్నారు. ఇదే మిక్కిలి అనుకూలమైన సమయం,
ఇదే రక్షణ దినం అని మీకు నేను చెప్తున్నాను.

### పౌలు కష్టాలు

3 మా పరిచర్యకు ఎలాంటి నింద రాకూడదని మేము ఎవరి
మార్గానికి ఆటంకాన్ని కలిగించడం లేదు.
4 కాని, మేము దేవుని సేవకులంగా మాకు మేమే అన్ని విధాలుగా
మెప్పించుకుంటున్నాము: సహనంలో సమస్యల్లో కష్టాల్లో దుఃఖాల్లో;
5 దెబ్బల్లో చెరసాలల్లో అల్లర్లలో కష్టమైన పనిలో నిద్రలేని రాత్రుల్లో
ఆకలిలో;

* **5:21** పాపంగా పాపపరిహారబలిగా * **6:2** యెషయా 49:8

6 పవిత్రతలో జ్ఞానంలో ఓర్పులో దయలో; పరిశుద్ధాత్మలో నిజమైన ప్రేమలో;
7 సత్యంగా మాట్లాడంలో దేవుని శక్తిలో; కుడిచేతిలో ఎడమ చేతిలో నీతి అనే ఆయుధాలను కలిగి;
8 ఘనతలో అవమానంలో నిందల్లో మెప్పుల్లో; యథార్థవంతులం అయినప్పటికి మోసం చేసేవారమనే నింద మామీద వేయబడింది;
9 తెలిసినవారమైనా తెలియనివారిగా ఎంచబడ్డాము; మరణిస్తున్నా జీవిస్తూనే ఉన్నాం; కొట్టబడ్డాం కాని చంపబడలేదు;
10 దుఃఖపడినా ఎల్లప్పుడు సంతోషిస్తూనే ఉన్నాం; మేము పేదలం కాని అనేకమందిని ధనవంతులుగా చేస్తున్నాము; ఏమి లేదు కాని సమస్తాన్ని కలిగి ఉన్నాము.
11 కొరింథీయులారా, మేము మీతో స్వేచ్ఛగా మాట్లాడాము, మా హృదయాలను మీ ఎదుట విశాలంగా తెరిచాం.
12 మా అభిమానాన్ని మీ నుండి మేము తగ్గించడం లేదు, కానీ మా నుండి మిమ్మల్ని మీరే దూరం ఉంచుతున్నారు.
13 నా బిడ్డలుగా భావించి నేను మీతో మాట్లాడుతున్నాను, మాలా మీరు కూడా మీ హృదయాలను విశాలంగా తెరవండి.

## విగ్రహారాధన గురించి హెచ్చరిక

14 అవిశ్వాసులతో సహవాసం చేయకండి. ఎందుకంటే నీతి అవినీతి ఎలా కలిసి ఉంటాయి? చీకటి వెలుతురు ఎలా కలిసి ఉంటాయి?
15 క్రీస్తుకు బెలియాలుతో ఏమి సంబంధం? విశ్వాసికి అవిశ్వాసికి పొత్తు ఏమిటి?
16 దేవాలయాలకు విగ్రహాలకు మధ్య ఉన్న ఒప్పందం ఏమిటి? మనం జీవంగల దేవుని ఆలయమై ఉన్నాము. కాబట్టి దేవుడు ఇలా చెప్పారు:
“నేను వారితో నివసిస్తాను
వారి మధ్య నడుస్తాను,

నేను వారి దేవునిగా ఉంటాను,
వారు నా ప్రజలుగా ఉంటారు."†
17 కాబట్టి,
"వారి మధ్య నుండి బయటకు వచ్చి
ప్రత్యేకంగా ఉండండి,
అని ప్రభువు చెప్తున్నాడు.
అపవిత్రమైన దానిని తాకకండి,
అప్పుడు నేను మిమ్మల్ని చేర్చుకుంటాను.‡
18 ఇంకా,
"నేను మీకు తండ్రిగా ఉంటాను,
మీరు నాకు కుమారులు కుమార్తెలుగా ఉంటారు,
అని సర్వశక్తిగల ప్రభువు చెప్తున్నాడు."§

# 7

1 ప్రియ మిత్రులారా, మనం ఈ వాగ్దానాలను కలిగి ఉన్నాం కాబట్టి,
దేవుని భయంతో పవిత్రతను సంపూర్ణం చేసుకొంటూ, శరీరానికి
ఆత్మకు కలిగిన సమస్త కల్మషం నుండి మనల్ని మనం పవిత్రులుగా
చేసుకుందాము.

## సంఘాల పశ్చాత్తాపం గురించి పౌలు ఆనందం

2 మీ హృదయంలో మాకు చోటియ్యండి. మేము ఎవరికీ
అన్యాయం చేయలేదు, ఎవరిని పాడుచేయలేదు, ఎవరినీ
మోసగించలేదు
3 మిమ్మల్ని గద్దించాలనే ఉద్దేశంతో నేను ఇలా చెప్పడం లేదు;
ఎందుకంటే, జీవించినా మరణించినా మేము మీతో ఉండేలా మా
హృదయాల్లో మీకు ప్రత్యేక స్థానం ఉందని నేను ముందే చెప్పాను.

† **6:16** లేవీ 26:12; యిర్మీయా 32:38; యెహె 37:27 ‡ **6:17** యెషయా 52:11; యెహె 20:34,41 § **6:18** 2 సమూ 7:14; 7:8

4 ఎంతో నిష్కపటంగా నేను మీకు చెప్పాను; మీ గురించి
నేను చాలా గర్వపడతాను. ఎంతో ధైర్యపరచబడతాను; మా
శ్రమలన్నింటిలో నా ఆనందానికి హద్దులు లేవు.

5 మాసిదోనియాకు చేరిన తర్వాత కూడా మాకు విశ్రాంతి లేదు,
అయితే ఎక్కడకు వెళ్లినా తీవ్రమైన ఆందోళనలు, బయట కలహాలు
లోపల భయాలు.
6 కానీ, బలహీన హృదయులను ధైర్యపరచే దేవుడే తీతు రాక
ద్వారా మమ్మల్ని ఓదార్చాడు.
7 అతని రాక వల్లనే కాదు కాని, మీరు అతనికిచ్చిన ఆదరణ
వల్ల కూడా. నన్ను చూడాలనే మీ కోరిక గురించి, మీ లోతైన
దుఃఖం గురించి, నా పట్ల మీకున్న అభిమానం గురించి అతడు మాకు
చెప్పాడు. అందుకు నేను ఎంతో ఎక్కువగా ఆనందించాను.

8 నేను వ్రాసిన పత్రిక మీకు బాధ కలిగించినా, దానికి నేను
బాధపడను. ఆ పత్రిక మీకు బాధ కలిగించిందని తెలిసి నేను
చింతించినా, అది కొంతకాలం వరకే.
9 మీకు దుఃఖం కలిగించినందుకు కాదు, మీ విచారం మీ
పశ్చాత్తాపానికి దారితీసినందుకు ఇప్పుడు నేను ఆనందిస్తున్నాను.
ఎందుకంటే, మా వలన మీరు ఏ విధంగా కూడా నష్టపోకూడదని
ఉండడానికి దేవుని చిత్తప్రకారం మీరు విచారించారు.
10 దైవికమైన విచారం, రక్షణ కలిగించే పశ్చాత్తాపానికి దారి
తీస్తుంది ఏ చింత ఉండదు, కాని లోకసంబంధమైన విచారం
మరణాన్ని తెస్తుంది.
11 దైవికమైన విచారం మీలో మీ నిర్దోషత్వాన్ని
నిరూపించుకోవాలనే ఎలాంటి ఆతురతను, ఆసక్తిని, ఆగ్రహాన్ని,
భయాన్ని, అభిలాషను, శ్రద్ధను, న్యాయం జరిగించడానికి ఎలాంటి
సంసిద్ధతను పుట్టిస్తుందో చూడండి. ప్రతిసారి ఈ విషయంలో మీరు
నిర్దోషులని మీకు మీరే నిరూపించుకున్నారు.
12 కాబట్టి నేను మీకు పత్రిక వ్రాసినప్పటికి, తప్పు చేసిన వారి

గురించి గాని బాధించబడినవారి గురించి గాని వ్రాయలేదు. అయితే మీరు మా పట్ల ఎలా శ్రద్ధ చూపించారో దాన్ని దేవుని ముందు మీరు చూడాలని వ్రాశాను.
13 వీటన్నిటిని బట్టి మేము ధైర్యపరచబడ్డాము.

మాకు ఈ ఆదరణ కలిగినపుడు, తీతు యొక్క ఆత్మ మీ అందరి వలన నెమ్మది పొందినందుకు అతడు ఎంత సంతోషంగా ఉన్నాడో చూసి మరి ఎక్కువగా సంతోషించాము.
14 మిమ్మల్ని అతని ముందు చాలా పొగిడాను, మీరు నన్ను సిగ్గుపరచలేదు, మీకు ఎప్పుడు నిజమే చెప్పాము. అలాగే తీతు ముందు మేము చేసిన పొగడ్తలు వాస్తవమైనవే అని నిరూపించబడ్డాయి.
15 కాబట్టి మీరందరు విధేయత చూపించి, భయంతో వణుకుతో అతన్ని మీరు ఎలా చేర్చుకున్నారో జ్ఞాపకం చేసుకున్నప్పుడు మీమీద అతనికున్న అభిమానం అధికమవుతుంది.
16 ప్రతి విషయంలో మీలో నాకు పూర్తి నమ్మకం ఉన్నందుకు నేను ఆనందిస్తున్నాను.

# 8

## ప్రభువు ప్రజల కోసం సేకరించుట

1 సహోదరీ సహోదరులారా, మాసిదోనియా ప్రాంతంలోని సంఘాలకు అనుగ్రహించబడిన దేవుని కృప గురించి మీరు తెలుసుకోవాలని మేము కోరుతున్నాము.
2 చాలా తీవ్రమైన పరీక్షల మధ్యలో కూడా అత్యధికమైన ఆనందాన్ని వారు పొందారు, వారు నిరుపేదలైనా విస్తారమైన దాతృత్వాన్ని కలిగి ఉన్నారు.
3 ఎందుకంటే, తాము ఇవ్వగలిగిన దానికన్నా, తమ సామర్థ్యాన్ని మించి వారు ఇచ్చారని నేను సాక్ష్యమిస్తాను.

4 ప్రభువు ప్రజలకు పరిచర్య చేయడంలో పాలుపంచుకునే
ఆధిక్యత అత్యవసరమని వారు మమ్మల్ని బ్రతిమాలారు.
5 వారు మా అంచనాలను అధిగమించారు: మొదటిగా తమను
తాము ప్రభువుకు అర్పించుకున్నారు, ఆ తర్వాత దేవుని చిత్తాన్ని బట్టి
మాకు కూడ తమను అర్పించుకున్నారు.
6 కాబట్టి తీతు ఈ దాతృత్వ పనిని గతంలో ప్రారంభించినట్లే మీ
వైపు నుండి కూడా దానిని పూర్తి చేయమని అతన్ని వేడుకున్నాము.
7 అయితే మీరు విశ్వాసంలో, వాక్యంలో, జ్ఞానంలో, ఆసక్తిలో, మాపై
మీకు గల ప్రేమలో శ్రద్ధలో ఎలా వృద్ధి చెందుతున్నారో అలాగే మీరు
ధారాళంగా ఇవ్వడంలో కూడా వృద్ధిచెందేలా చూసుకోండి.
8 ఆజ్ఞాపించి మీకు చెప్పడం లేదు, కాని సహాయం
చేయడంలో ఇతరుల ఆసక్తితో పోల్చి మీ ప్రేమ ఎంత నిజమైనదో
పరీక్షించాలనుకుంటున్నాను.
9 మన ప్రభువైన యేసు క్రీస్తు కృప ఎలాంటిదో మీకు
తెలుసు. ఆయన ధనవంతుడైనా తన పేదరికం ద్వారా మిమ్మల్ని
ధనవంతులను చేయడానికి మీ కోసం ఆయన పేదవానిగా అయ్యారు.
10 ఈ విషయంలో మీకు ఏది మంచిదో నా అభిప్రాయాన్ని
చెప్తున్నాను. గత ఏడాది మీరు ఇవ్వడంలోనే కాదు అలా చేయాలనే
ఆసక్తిలో కూడా మొదటివారిగా ఉన్నారు.
11 కాబట్టి ఆ పనిని ముగించండి, అప్పుడు చేయాలనే మీ ఆసక్తిని,
మీ సామర్థ్యాన్ని బట్టి దాన్ని పూర్తి చేయడం ద్వారా సరిపోల్చవచ్చు.
12 ఎందుకంటే, ఇవ్వాలనే ఆసక్తి మీకు ఉంటే, మీ
సామర్థ్యాన్ని మించి కాకుండా మీకు ఉన్నదానిలో ఇచ్చే మీ కానుక
అంగీకరించదగింది.
13 మీ పైనే భారాన్ని ఉంచి ఇతరులను వదిలేయాలని మేము
కోరడంలేదు కాని సమానత్వం ఉండాలని మా కోరిక.
14 ప్రస్తుత సమయంలో మీ సమృద్ధి వారికవసరమైనది సరఫరా
చేస్తుంది, అలాగే మీరు అవసరంలో ఉన్నప్పుడు వారి సమృద్ధి మీకు

అవసరమైనది సరఫరా చేస్తుంది. సమానత్వమే లక్ష్యం,
15 ఎందుకంటే, "ఎక్కువ పోగుచేసుకున్న వారికి ఎక్కువ
మిగల్లేదు, తక్కువ పోగుచేసుకున్న వారికి తక్కువ కాలేదు"* అని
వ్రాయబడి ఉంది.

## సేకరించిన వాటిని తీసుకోవడానికి తీతు పంపబడుట

16 మీ పట్ల నాకున్న శ్రద్ధనే తీతు హృదయంలో కూడా కలిగించిన
దేవునికి కృతజ్ఞతలు.
17 తీతు మా మనవిని అంగీకరించడమే కాకుండా, అతడు ఎంతో
ఉత్సాహంతో తన ఇష్టంతో మీ దగ్గరకు వస్తున్నాడు.
18 సువార్త పరిచర్య చేయడంలో సంఘాలన్నింటిలో ప్రసిద్ధి చెందిన
సోదరుని కూడా అతనితో పంపుతున్నాను.
19 అంతేకాక, కేవలం ప్రభువును మహిమపరచడానికి, సహాయం
చేయడంలో మాకున్న ఆసక్తిని చూపించడానికి మేము చేస్తున్న దానిలో
భాగంగా కానుకలను తీసుకెళ్తున్నప్పుడు మాతో పాటు ఉండడానికి
సంఘాలు అతన్ని ఏర్పరచుకున్నారు.
20 దాతృత్వంతో ఇచ్చిన కానుకలను మేము ఉపయోగించే
విధానం గురించి ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్త
పడుతున్నాము.
21 కేవలం ప్రభువు దృష్టిలో మాత్రమే గాక, మనుష్యుల
దృష్టికి కూడా మంచిది అనిపించిందే చేయాలని మేము బాధలు
అనుభవిస్తున్నాము.
22 అంతేకాక, మా సహోదరున్ని వారితో కూడా పంపుతున్నాము.
అతడు ఆసక్తి కలిగినవాడని మాకు అనేకసార్లు రుజువుచేసి
చూపించాడు. మీపై అతనికున్న నమ్మకాన్ని బట్టి ఇప్పుడు ఇంకా
ఎక్కువ ఆసక్తిగా ఉన్నాడు.

* **8:15** నిర్గమ 16:18

23 ఇక తీతు అయితే నా జతపనివాడు మీ మధ్యలో తోటి
పనివాడు; మా సహోదరులైతే సంఘాలకు ప్రతినిధులు క్రీస్తుకు ఘనత
తెచ్చేవారు.
24 అందువల్ల వారికి మీ ప్రేమను చూపించండి, మీ గురించి మేము
ఎందుకు గర్విస్తున్నామో చూపించండి. అప్పుడు సంఘాలు కూడా
తెలుసుకోగలవు.

# 9

1 పరిశుద్ధులకు చేస్తున్న పరిచర్య గురించి నేను మీకు వ్రాయాల్సిన
అవసరం లేదు.
2 సహాయం చేయడానికి మీరు ఆసక్తి గలవారని నాకు తెలుసు,
అందుకే మాసిదోనియాలోని ప్రజలకు మీ గురించి గొప్పగా చెప్పి,
అకాయలో ఉన్న మీరు గత ఏడాది నుండి సహాయం చేయడానికి
సిద్ధపడ్డారని వారికి చెప్పాను; మీ ఆసక్తి వారిలో అనేకమందిని
ప్రేరేపించింది.
3 అయితే ఈ విషయంలో మీ గురించి మేము చెప్పిన గొప్పలు
వట్టివి కాకుండా నేను చెప్పినట్లుగా మీరు సిద్ధంగా ఉండాలని
సహోదరులను నేను పంపుతున్నాను.
4 ఒకవేళ మాసిదోనియా వారెవరైనా నాతో వచ్చినపుడు మీరు
సిద్ధంగా లేరని చూస్తే, మీరే కాదు మీమీద ఎంతో నమ్మకాన్ని కలిగి
ఉన్నందుకు మేము కూడా సిగ్గుపడాల్సి ఉంటుంది.
5 అందుకే, మీరు వాగ్దానం చేసిన కానుకలు అయిష్టంగా కాకుండా
దాతృత్వంతో ఇచ్చేలా సిద్ధపడి ఉండడానికి ప్రోత్సహించేలా మీ
దగ్గరకు ముందుగానే సహోదరులను పంపడం అవసరమని నేను
అనుకున్నాను.

## దాతృత్వం ప్రోత్సహింపబడుట

6 ఇది జ్ఞాపకం ఉంచుకోండి: కొంచెం విత్తినవానికి కొంచెం
పంటే పండుతుంది. విస్తారంగా విత్తినవానికి విస్తారమైన పంట
పండుతుంది.
7 సంతోషంతో ఇచ్చేవారిని దేవుడు ప్రేమిస్తారు కాబట్టి అయిష్టంగా
బలవంతంగా కాకుండా మీలో ప్రతి ఒక్కరు మీ హృదయాల్లో
నిర్ణయించుకున్న ప్రకారం ఇవ్వండి.
8 అన్ని విషయాల్లో, అన్నివేళల్లో మీకు కావలసినవన్ని కలిగి
ఉండి, ప్రతి మంచి కార్యంలో సమృద్ధిగా ఉండేలా దేవుడు మిమ్మల్ని
సమృద్ధిగా దీవించగలరు.
9 దీని గురించి ఇలా వ్రాయబడి ఉంది:
"వారు ధారాళంగా బహుమానాలను పేదలకు పంచిపెట్టారు.
వారి నీతి నిరంతరం నిలిచి ఉంటుంది."*
10 విత్తువానికి విత్తనాలు, తినడానికి రొట్టె సమకూర్చే దేవుడు మీకు
విత్తనం ఇచ్చి ఫలింపజేస్తారు, మీ నీతి పంటను విస్తరింపజేస్తారు.
11 మీరు ప్రతి సమయంలో ధారాళంగా ఇవ్వడానికి మీరు అన్ని
రకాలుగా సంపన్నులు అవుతారు. మీ దాతృత్వం బట్టి మా ద్వారా
దేవునికి కృతజ్ఞతలు చెల్లించబడతాయి.
12 మీరు చేసే ఈ పరిచర్య కేవలం పరిశుద్ధుల అవసరాలు
తీర్చడమే కాదు, దేవునికి అనేక విధాలుగా కృతజ్ఞతలు
చెల్లించినట్టవుతుంది.
13 ఈ పరిచర్య వలన మిమ్మల్ని మీరు నిరూపించుకున్నారు. క్రీస్తు
సువార్తను మీరు అంగీకరించడాన్ని బట్టి కలిగిన విధేయత కోసం,
వారితో అందరితో పాలుపంచుకొనే మీ దాతృత్వం బట్టి ఇతరులు
దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తారు.
14 దేవుడు మీకిచ్చిన అత్యధిక కృపను బట్టి వారు మీ కోసం
ప్రార్థిస్తూ, మిమ్మల్ని చూడాలని ఆశపడుతున్నారు.
15 చెప్పశక్యం కాని ఆయన వరాన్ని బట్టి దేవునికి కృతజ్ఞతలు.

* **9:9** కీర్తన 112:9

# 10

## పౌలు తన పరిచర్య కోసం పోరాటం

1 క్రీస్తు యొక్క వినయం సౌమ్యతను బట్టి నేను మీకు విజ్ఞప్తి
చేస్తున్నాను. పౌలు అనే నేను మీతో ముఖాముఖిగా ఉన్నపుడు
"పిరికివాన్ని" కాని మీకు దూరంగా ఉన్నపుడు "ధైర్యశాలిని."
2 ఈ లోక పద్ధతులతో మేము జీవిస్తున్నామని భావించే
కొందరితో ధైర్యంగా వ్యవహరించాలని అనుకుంటున్నాను, కాని
నేను అక్కడికి వచ్చినప్పుడు అలా జరగకుండా ఆపాలని మిమ్మల్ని
బ్రతిమాలుతున్నాను.
3 మేము ఈ లోకంలో జీవించినా ఈ లోకంలా మేము పోరాటం
చేయము.
4 మా పోరాటంలో మేము ఉపయోగించే ఆయుధాలు ఈ
లోకసంబంధమైన ఆయుధాలు కావు. కోటలను కూడ ధ్వంసం
చేయగల దైవశక్తిగల ఆయుధాలు.
5 వితండ వాదాలను, దేవుని జ్ఞానానికి అడ్డునిలిచే ప్రతి ఆటంకాన్ని
మేము ధ్వంసం చేస్తాము. ప్రతి ఆలోచనను వశపరచుకొని క్రీస్తుకు
లోబడేలా చేస్తాము.
6 మీ విధేయత సంపూర్ణమైన తర్వాత అవిధేయతనంతటిని
శిక్షించడానికి మేము సిద్ధంగా ఉన్నాము.

7 పైకి కనబడే వాటిని* బట్టి చూస్తున్నారు. ఎవరైనా తాము
క్రీస్తుకు చెందిన వారమని నమ్మితే, వారిలా మేము కూడా క్రీస్తుకు
చెందినవారమే అని మరల వారు ఎంచాలి.
8 పడగొట్టడానికి కాక మిమ్మల్ని కట్టడానికే ప్రభువు మాకు ఇచ్చిన
అధికారాన్ని గురించి ఒకవేళ నేను గొప్పలు చెప్పుకొన్నా దాని కోసం
నేను సిగ్గుపడను.
9 నేను నా పత్రికలతో మిమ్మల్ని భయపెట్టాలని అనుకోవడం లేదు.

* **10:7** లేదా స్పష్టంగా కనిపించే వాటిని

10 “ఇతని పత్రికలు గొప్పగా శక్తివంతంగా ఉంటాయి కాని వ్యక్తిగా
అతడు బలహీనుడు అతని మాటలు విలువలేనివి” అని కొందరు
అన్నారు.
11 మేము లేనప్పుడు పత్రికల్లో ఏమి వ్రాసామో మేము అక్కడ
ఉన్నప్పుడు మేము అదే చేస్తామని అలాంటివారు గ్రహించాలి.
12 తమను తామే పొగడుకునే వారితో జత చేరడానికి గాని
పోల్చుకోడానికి గాని మాకు ధైర్యం లేదు. ఎప్పుడైతే వారు తమను
తామే బేరీజు వేసుకుంటూ తమలో తామే పోల్చుకుంటారో వారు
తెలివిలేనివారని అర్థము.
13 మేమైతే పరిమితికి మించి పొగడుకోం, అయినా, దేవుడు
మాకు కొలిచి ఇచ్చిన హద్దుల్లోనే ఉన్నాము, ఆ హద్దులో మీరు కూడా
ఉన్నారు.
14 క్రీస్తు సువార్తతో మేము మీ దగ్గరకు వచ్చాం కాబట్టి మీ దగ్గరకు
మేము రానట్లుగానే మేము పొగడుకోవడంలో మా హద్దులు మీరడం
లేదు.
15 ఇతరులు చేసిన పనుల గురించి మా హద్దులు దాటి మేము
గొప్పలు చెప్పము. మీ విశ్వాసం అభివృద్ధి చెందుతూ, మీ మధ్యలో
మేము పని చేయాల్సిన ప్రాంతం విస్తరించాలని మా నిరీక్షణ.
16 అప్పుడు మీకు అవతల ఉన్న ప్రాంతాల్లో కూడా మేము ఈ
సువార్తను బోధించగలము. కాబట్టి వేరొకరి ప్రాంతంలో ఇంతకుముందే
జరిగిన పని గురించి మేము పొగడుకోవాలని కోరడంలేదు.
17 అయితే, “గర్వించేవారు ప్రభువులోనే గర్వించాలి.”†
18 తనను తానే మెచ్చుకొనేవారు యోగ్యులు కారు గాని, ప్రభువు
మెచ్చుకొనేవారే యోగ్యులు.

# 11

## పౌలు, అబద్ధ అపొస్తలులు

† **10:17** యిర్మీయా 9:24

1 నేను కొంత అవివేకంగా మాట్లాడినా మీరు సహించాలని
ఆశిస్తున్నాను. అవును, దయచేసి నన్ను సహించండి!
2 దైవికమైన ఆసక్తిని మీ పట్ల నేను కలిగి ఉన్నాను. ఎందుకంటే,
మిమ్మల్ని నేను క్రీస్తు అనే ఏకైక భర్తకు ప్రధానం చేశాను, కాబట్టి
పవిత్రమైన కన్యగా మిమ్మల్ని ఆయనకు అప్పగించాలి.
3 అయితే, సర్పం తన కుయుక్తితో హవ్వను మోసగించినట్లు క్రీస్తులో
మీకున్న నిజాయితీ, పవిత్రత నుండి ఏదో ఒక విధంగా మీ మనస్సులు
తొలగిపోతాయేమోనని నేను భయపడుతున్నాను.
4 ఎవరైనా మీ దగ్గరకు వచ్చి మేము ప్రకటించిన యేసును గాక
వేరొక యేసును ప్రకటించినా, లేదా మీరు పొందిన ఆత్మకు విరుద్ధమైన
వేరొక ఆత్మను మీరు పొందినా, లేదా మీరు అంగీకరించింది కాకుండా
వేరొక సువార్తను అంగీకరించినా మీరు సులువుగానే సహిస్తున్నారు.
5 "ఈ గొప్ప అపొస్తలుల"* కంటే నేను ఏమాత్రం తక్కువ కాదని
నేను అనుకుంటున్నాను.
6 మాట్లాడడంలో నాకు నేర్పు లేకపోవచ్చు కాని జ్ఞానంలో కాదు.
అన్ని విధాలుగా మేము దీన్ని మీకు పూర్తిగా స్పష్టం చేశాము.
7 దేవుని సువార్తను మీకు ఉచితంగా బోధించి, మిమ్మల్ని
గొప్పవారిని చేయడానికి నన్ను నేను తగ్గించుకొని పాపం చేశానా?
8 మీకు నేను సేవ చేయడానికి ఇతర సంఘాల నుండి సహాయం
పొంది వారిని దోచుకున్నాను.
9 అంతేకాక నేను మీతో ఉన్నప్పుడు నాకు సహాయం అవసరమైతే
నేను ఎవరికి భారంగా లేను, ఎందుకంటే, మాసిదోనియా నుండి
వచ్చిన సహోదరులే నాకు అవసరమైనవన్నీ అందించారు. నేను మీకు
భారం కాకుండా ఎలా ఉన్నానో ఇకముందు కూడా అలాగే ఉంటాను.
10 నాలో క్రీస్తు సత్యం ఉన్నందుకు, అకాయ ప్రాంతాల్లో నేనిలా
గర్వపడకుండ ఎవరు ఆపలేరు.
11 ఎందుకు? మీపై నాకు ప్రేమ లేదా? ఉందని దేవునికి తెలుసు!

---

* **11:5** లేదా అత్యంత ప్రముఖులైన అపొస్తలులు

12 గర్వించడానికి కారణం వెదికేవారు తాము గర్వించే వాటిలో
మాతో సమానంగా ఉన్నామని వారు ఎంచుకోవడానికి అవకాశం
లేకుండా చేయడానికి ఇప్పుడు నేను ఏమి చేస్తున్నానో అదే చేయడం
కొనసాగిస్తాను.
13 అలాంటివారు అబద్ధ అపొస్తలులు, మోసపూరితమైన
పనివారు, క్రీస్తు అపొస్తలుల్లా వేషం వేసుకున్నవారు.
14 ఇందులో ఆశ్చర్యం ఏమి లేదు, సాతాను కూడా వెలుగు దూత
వేషం వేసుకున్నాడు.
15 కాబట్టి వాని సేవకులు కూడా నీతి సేవకుల్లా మారువేషం
వేసుకోవడంలో వింత లేదు. వారి క్రియలకు తగిన అంతం వారికి
ఉంటుంది.

## పౌలు తన శ్రమల గురించి గొప్ప చెప్పుకోవడం

16 నేను అవివేకినని ఎవరు అనుకోవద్దని మరల చెప్తున్నాను;
ఒకవేళ మీరు అలా భావిస్తే అవివేకంగానైనా మీరు నన్ను చేర్చుకోండి
అప్పుడు నేను కొంచెం గొప్ప చెప్పుకుంటాను.
17 ఆత్మవిశ్వాసం బట్టి గొప్ప చెప్పడంలో నేను ప్రభువులా
మాట్లాడడం లేదు కాని అవివేకిగానే మాట్లాడుతున్నాను.
18 ఈ లోకరీతిగా అనేకమంది గొప్ప చెప్పుకుంటున్నారు కాబట్టి
నేను కూడా గొప్ప చెప్పుకుంటాను.
19 మీరు ఎంతో వివేకవంతులు కాబట్టి అవివేకులను కూడ
సంతోషంగా సహిస్తారు.
20 నిజానికి, మిమ్మల్ని ఎవరైనా బానిసలుగా చేసినా, మోసం
చేసినా, లేదా మిమ్మల్ని చిక్కుల్లో ఇరికించినా, మిమ్మల్ని ముఖంపై
కొట్టినా మీరు సహిస్తారు.
21 ఆ విషయంలో మేమెంతో బలహీనులమని నేను సిగ్గుతో
ఒప్పుకుంటున్నాను.

అయితే ఎవరైనా దేని గురించైనా గొప్పలు చెప్పుకోడానికి ధైర్యం చేస్తే దాని గురించి నేను కూడా గొప్పలు చెప్పుకోడానికి ధైర్యం చేస్తాను, నేను అవివేకిగా మాట్లాడుతున్నాను.

22 వారు హెబ్రీయులా? నేను కూడా. వారు ఇశ్రాయేలీయులా? నేను
కూడా. వారు అబ్రాహాము సంతతి వారా? నేను కూడా.

23 వారు క్రీస్తు సేవకులా? నేను మతిలేనివానిలా మాట్లాడుతున్నాను, నేను వారికంటే ఎక్కువ. నేను ఎంతో కష్టపడి పని చేశాను. ఎక్కువసార్లు నేను చెరసాలలో ఉన్నాను, చాలా తీవ్రంగా కొరడా దెబ్బలు తిన్నాను, అనేకసార్లు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాను.

24 యూదులచేత అయిదు సార్లు ఒకటి తక్కువ నలభై కొరడా దెబ్బలు తిన్నాను.

25 మూడుసార్లు బెత్తాలతో కొట్టబడ్డాను, ఒకసారి రాళ్లతో కొట్టబడ్డాను, మూడుసార్లు ఓడ పగిలి శ్రమపడ్డాను. ఒక రాత్రింబగళ్ళు సముద్రంలో గడిపాను.

26 తరచుగా ప్రయాణాలు చేస్తున్నాను. నదుల వల్ల ఆపదలు, దొంగల వల్ల ఆపదలు, తోటి యూదుల వల్ల ఆపదలు, యూదేతరుల వల్ల ఆపదలు, పట్టణాల్లో, అడవుల్లో, సముద్రాల మీద ఆపదల్లో పడ్డాను; ఇంకా కపట సహోదరుల వల్ల ఆపదల్లో ఉన్నాను.

27 నేను ప్రయాసపడ్డాను కష్టపడ్డాను, తరచూ నిద్ర లేకుండా ఉండేవాన్ని; ఆకలి దాహం నాకు తెలుసు, అనేకసార్లు ఆహారం లేకుండా ఉన్నాను; చలితో, వస్త్రాలు లేకుండా ఉన్నాను.

28 అన్నిటికంటే మించి సంఘాలన్నిటి గురించిన చింత అనుదినం నాకు కలుగుతుంది.

29 ఎవరైనా బలహీనంగా ఉంటే, నేను బలహీనంగా ఉండనా? ఎవరైనా పాపంలో నడిస్తే, నా హృదయం మండదా?

30 ఒకవేళ నేను గర్వించాలంటే, నా బలహీనతలను చూపించే వాటిలోనే గర్విస్తాను.

31 ఎల్లప్పుడు స్తుతించబడే యేసు ప్రభువుకు తండ్రియైన దేవునికి
నేను అబద్ధమాడనని తెలుసు.
32 దమస్కులో అరెత అనే రాజు క్రింది అధిపతి నన్ను
బంధించడానికి పట్టణం చుట్టూ కాపలా ఉంచాడు.
33 కాని నేను కిటికీ గుండా గోడ పైనుండి ఒక గంపలో క్రిందకు
దించబడి, వాని చేతుల్లో నుండి తప్పించుకున్నాను.

# 12

## పౌలు దర్శనం, అతని ముల్లు

1 నేను గర్వపడవచ్చు కాని, దాని వలన నాకు ప్రయోజనం లేదు.
ప్రభువు దర్శనాల గురించి, ప్రత్యక్షతల గురించి చెప్తాను.
2 క్రీస్తులో ఉన్న ఒక వ్యక్తి నాకు తెలుసు, అతడు పద్నాలుగు
సంవత్సరాల క్రితం మూడవ ఆకాశానికి కొనిపోబడ్డాడు. అతడు
శరీరంతో కొనిపోబడ్డాడా లేక శరీరం లేకుండా కొనిపోబడ్డాడా అనేది
నాకు తెలియదు; అది దేవునికే తెలుసు.
3 అలాంటి వ్యక్తి నాకు తెలుసు. అతడు అది శరీరంతోనా లేదా
శరీరం లేకుండా కొనిపోబడ్డాడో నాకు తెలియదు. అది దేవునికే
తెలుసు.
4 అతడు పరదైసుకు కొనిపోబడ్డాడు, ఎవరూ చెప్పలేని మాటలు
విన్నాడు, ఆ మాటలు పలకడానికి ఎవ్వరికి అనుమతి లేదు.
5 కాబట్టి అలాంటి వాని గురించి గర్విస్తాను, కాని నా గురించి
అయితే నా బలహీనత గురించి తప్ప వేరు విధంగా గర్వించను.
6 ఒకవేళ నేను గర్వించాలనుకున్నా సత్యమే చెప్తాను కాబట్టి
అవివేకిని కాను. కాని నేను చేసిన దానికి లేదా చెప్పిన దానికి
మించి ఎవరూ నా గురించి ఎక్కువగా ఆలోచించకుండా నేను వాటికి
దూరంగా ఉన్నాను.
7 నాకు కలిగిన విశేషమైన గొప్ప ప్రత్యక్షతలు వల్ల గర్వంతో
ఉబ్బిపోకుండ నా శరీరంలో ఒక ముల్లు పెట్టబడింది. అది సాతాను
దూతగా పని చేసి నన్ను నలుగగొట్టి గర్వించకుండా చేస్తుంది.

8 దీన్ని నా నుండి తీసివేయమని నేను మూడుసార్లు ప్రభువుకు
మనవి చేశాను.
9 అందుకు, "నా కృప నీకు చాలు, బలహీనతలో నా శక్తి
పరిపూర్ణమవుతుంది" అని ఆయన నాతో చెప్పారు. అందువల్ల క్రీస్తు
శక్తి నా మీద నిలిచి ఉండేలా నా బలహీనతల్లోనే నేను గర్విస్తాను.
10 అందుకే క్రీస్తు కోసం నాకు కలిగిన బలహీనతలు, అవమానాలు,
కష్టాలు, హింసలు, బాధలు నాకు ఆనందాన్నే కలిగిస్తాయి. నేను
ఎప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను.

## కొరింథీయుల పట్ల పౌలు శ్రద్ధ

11 నన్ను నేనే బుద్ధిహీనునిగా చేసుకున్నాను, కాని మీరే నన్ను
బలవంతం చేశారు. నిజానికి మీరు నన్ను మెచ్చుకోవల్సింది,
ఎందుకంటే, నేను వ్యర్థుడనే అయినా మీ "శ్రేష్ఠమైన అపొస్తలుల"
కంటే ఏ విషయంలో తక్కువ వాడను కాను.
12 అపొస్తలుల సూచకక్రియలు, అద్భుతాలు, మహత్కార్యాలు
పూర్తి సహనంతో నా వల్ల మీ మధ్య జరిగాయి.
13 నేనెప్పుడు మీకు భారంగా లేను అనేది తప్ప ఇతర సంఘాల
కంటే మీరు ఎలా తక్కువ అవుతారు? ఈ తప్పును బట్టి నన్ను
క్షమించండి!
14 నేను మూడవసారి మీ దగ్గరకు రావడానికి సిద్ధంగా ఉన్నాను,
అయితే వచ్చినప్పుడు మీకు భారంగా ఉండను, ఎందుకంటే నాకు
కావల్సింది మీరే తప్ప మీ ధనం కాదు. పిల్లలు తల్లిదండ్రుల కోసం
కాదు తల్లిదండ్రులే పిల్లల కోసం పొదుపు చేసి ఉంచాలి.
15 కాబట్టి నాకు కలిగినదంత మీ ఆత్మల కోసం చాలా సంతోషంగా
ఖర్చుచేస్తాను, అంతేకాదు నన్ను నేను కూడా మీ కోసం ఖర్చు
చేసుకుంటాను; నేను మిమ్మల్ని ఎక్కువగా ప్రేమించినప్పుడు మీరు
నన్ను తక్కువగా ప్రేమిస్తారా?

16 అదలా ఉండనివ్వండి, నేను మీకు భారంగా ఉండలేదు గాని
యుక్తిగా మాయ చేసి మిమ్మల్ని పట్టుకున్నాను అని అంటారేమో!
17 నేను మీ దగ్గరకు పంపినవారి ద్వారా మిమ్మల్ని మోసం చేసి
ఏమైనా సంపాదించుకున్నానా?
18 తీతును మీ దగ్గరకు వెళ్లమని వేడుకున్నాను. అతనితో పాటు
మా సహోదరున్ని కూడ పంపాను. తీతు మిమ్మల్ని దోచుకోలేదు కదా?
మేము ఒకే ఆత్మను కలిగి ఒకే అడుగుజాడల్లో నడువలేదా?
19 ఇంతవరకు మేము మీతో మా పక్షంగా వాదించుకుంటున్నామని
మీరు అనుకుంటున్నారా? దేవుని దృష్టికి క్రీస్తులో ఉన్న వారిలా మేము
మాట్లాడుతున్నాము; మిత్రులారా! మేము చేసే ప్రతిదీ మిమ్మల్ని
బలపరచడానికే.
20 ఎందుకంటే నేను వచ్చినపుడు నేను కోరుకున్నట్లుగా మీరు
ఉండకపోవచ్చు, అలాగే మీరు కోరుకున్నట్లుగా నేను ఉండకపోవచ్చు.
అక్కడ కలహాలు, అసూయలు, క్రోధాలు, కక్షలు, వదంతులు,
గుసగుసలు, గర్వం, అల్లర్లు ఉంటాయేమోనని భయపడుతున్నాను.
21 మరల నేను వచ్చినప్పుడు దేవుడు మీ ముందు నన్ను
చిన్నబుచ్చుకునేలా చేస్తాడేమోనని భయపడుతున్నాను, అంతేగాక
గతంలో పాపం చేసి జరిగించిన అపవిత్రత, లైంగిక పాపం, పోకిరి
చేష్టల గురించి పశ్చాత్తాపం చెందని వారి గురించి కూడ నేను
దుఃఖపడాల్సి వస్తుందేమో అని భయపడుతున్నాను.

# 13

## తుది హెచ్చరికలు

1 నేను మీ దగ్గరకు రావడం ఇది మూడవసారి. "ఇద్దరు లేదా
ముగ్గురు సాక్ష్యాల మీద ప్రతి విషయం నిర్ధారించబడాలి."*
2 నేను రెండవసారి మీ దగ్గర ఉన్నపుడే మిమ్మల్ని హెచ్చరించాను,
ఇప్పుడు మీ దగ్గర లేకపోయినా మళ్ళీ చెప్పేదేమంటే నేను మళ్ళీ

* **13:1** ద్వితీ 19:15

వచ్చినపుడు గతంలో పాపం చేసిన వారిని ఇతరులను ఎవరిని విడిచిపెట్టను.

3 క్రీస్తు నా ద్వారా మాట్లాడుతున్నారని మీరు రుజువులు అడిగారు. ఆయన మీ వ్యవహారంలో బలహీనుడు కాడు, మీలో ఆయన బలవంతుడు.

4 బలం లేనివానిగా ఆయన సిలువ వేయబడ్డారు కాని, దేవుని శక్తినిబట్టి ఆయన జీవిస్తున్నారు. అలాగే మేము ఆయనలో బలహీనులం, అయినా మేము మీతో వ్యవహరించే విషయంలో దేవుని శక్తినిబట్టి ఆయనతో కూడ జీవిస్తున్నాము.

5 మీరు విశ్వాసంలో ఉన్నారో లేదో మిమ్మల్ని మీరే పరీక్షించుకోండి; మీరు పరీక్షలో ఓడిపోకపోతే తప్ప యేసు క్రీస్తు మీలో ఉన్నాడని మీకు తెలియదా?

6 కాని మేము పరీక్షలో ఓడిపోలేదని మీరు తెలుసుకుంటారని నేను నమ్ముతున్నాను.

7 మీరు ఏ తప్పులు చేయకూడదని, మేము పరీక్షలో నిలబడినట్లు ప్రజలు చూడాలని కాదు గాని, మేము ఓడిపోయినట్లుగా కనిపించినా మీరు మాత్రం సరియైన దానినే చేయాలని మేము దేవుని ప్రార్థిస్తున్నాము.

8 కాబట్టి మేము సత్యానికి విరోధంగా ఏమి చేయలేము, సత్యం కోసం మాత్రమే చేస్తాము.

9 మేము బలహీనంగా ఉన్నా మీరు బలంగా ఉంటేనే మాకు సంతోషం. మీరు సంపూర్ణులు కావాలని మేము ప్రార్థిస్తున్నాము.

10 కాబట్టి నేను మీ దగ్గరకు వచ్చినప్పుడు మీ పట్ల నేను కఠినంగా ఉండాల్సిన అవసరం లేకుండ ఇప్పుడే ఇవన్నీ మీకు వ్రాస్తున్నాను. ఎందుకంటే మిమ్మల్ని పడద్రోయడానికి కాక మిమ్మల్ని కట్టడానికే ప్రభువు నాకు అధికారాన్ని ఇచ్చారు.

### చివరి శుభాలు

11 చివరిగా సహోదరీ సహోదరులారా, సంతోషించండి!
సంపూర్ణంగా పునరుద్ధరించబడడానికి పోరాడండి. ఒకరిని ఒకరు
ప్రోత్సహించుకోండి, ఏక మనస్సు కలిగి ఉండండి. సమాధానం కలిగి
జీవించండి. ప్రేమ సమాధానాలకు కర్తయైన దేవుడు మీకు తోడుగా
ఉండును గాక.

12 ఒకరిని ఒకరు పవిత్రమైన ముద్దుతో శుభాలు చెప్పుకోండి.
13 ఇక్కడ ఉన్న దేవుని ప్రజలందరు మీకు శుభాలు
పంపుతున్నారు.

14 ప్రభువైన యేసు క్రీస్తు కృప, దేవుని ప్రేమ, పరిశుద్ధాత్మ
సహవాసం మీకందరికి తోడై యుండును గాక.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.

You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."

Notice of copyright must appear on the title or copyright page of the work as follows:

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.

"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.

You must also make your derivative work available under the same license (CC BY-SA).

If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.

You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

- You include the above copyright and source information.
- If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.
- If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.

Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025

aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6